## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**సుభాష్‌నగర్:** విద్యుత్ మరమ్మతుల కారణంగా గాజులరామారంలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్ఏఎల్ కాలనీ, ఆర్ఎంనగర్, దేవేందర్‌నగర్, రావినారాయణరెడ్డి నగర్, శివసాయి హిల్స్, కైసర్‌నగర్, లాల్‌సాబ్‌గూడ, వోక్షిత్ హిల్, వీనస్‌రాక్ హైట్స్, వివేకానంద నగర్, శ్రీనివాస్‌నగర్‌లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**ఎన్‌సీఎల్ ఫీడర్ పరిధిలో**

**కుత్బుల్లాపూర్:** విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగనుందని కొంపల్లి సబ్‌స్టేషన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఎన్‌సీఎల్ ఫీడర్ పరిధిలోని కేవీఆర్ ఫంక్షన్‌హాల్ లేన్, విజయశాంతి ఎన్‌క్లేవ్, శివరెడ్డి గౌడాన్స్, ఎన్‌సీఎల్ సిమ్మింగ్ పూల్స్, ప్రజాయ్ అపార్ట్‌మెంట్స్, మనభూమి ఎన్‌క్లేవ్, వెన్‌సాయి అపార్ట్‌మెంట్స్, కేవీఆర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**మల్లంపేట్ ఫీడర్ పరిధిలో..**

**నిజాంపేట్:** బాచుపల్లి ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని బాచుపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. మల్లంపేట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కేఆర్‌సీఆర్ కాలనీ, రెయిన్‌బోకాలనీ, ప్రణీత్ వ్యాలీ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

### కంటి వెలుగుకు విశేష స్పందన



**జగద్గిరిగుట్ట:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్ రోడ్ నం.14లో సోమవారం నుంచి నిర్వహిస్తున్న కంటి వెలుగు కేంద్రానికి స్థానికులు వచ్చి కంటి పరీక్షలు చేయించుకుంటున్నారు. డాక్టర్లు వీరికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేశారు. ప్రతి రోజు సుమారు 100మంది వరకు కంటి పరీక్షలు చేయించుకుంటున్నారు. బీద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఉండే జగద్గిరిగుట్ట ప్రాంతంలో ప్రజల నుంచి స్పందన రావడంతో వచ్చే వారం కూడా కొనసాగుతుందన్నారు. ప్రతి శనివారం, ఆదివారాల్లో సైతం ఈ కార్యక్రమం ఉండదని డాక్టర్లు తెలిపారు.

### 25న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

**కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాల సన్నాహక సమావేశం ఈనెల 25న గండిమైసమ్మలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉదయం 11.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు, రైతుబంధు రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అనుబంధ కమిటీల సభ్యులు హాజరు కావాలని ప్రకటనలో కోరారు.

### గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న త్రివేణి ప్రిన్సిపల్ సుబ్బారావు

**కుత్బుల్లాపూర్:** సుచిత్రలోని త్రివేణి పాఠశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పట్టాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నటరాజ్ మాట్లాడుతూ... విద్యార్థులకు చదువుతో పాటు సమాజం పట్ల అవగాహన కల్పించడంతో పాటు మానవతా విలువలను నేర్పించాలన్నారు. ప్రిన్సిపాల్ సుబ్బారావు, సీఆర్ఓ వెంకట్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ వాణి తదితరులు పాల్గొన్నారు.

### 26న ఎస్‌డీఎస్‌ఎస్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

**చింతల్:** శ్రీధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 26న ఎస్‌డీఎస్‌ఎస్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించనున్నారు. గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 9గంటలకు జరిగే టెస్ట్‌లో భగత్‌సింగ్‌నగర్ కాలనీ విద్యార్థులు పాల్గొని లబ్ధిపొందాలని నిర్వాహకులు సూచించారు. 9059663440/9000665999 నంబర్ల వాట్సాప్‌లకు శనివారం మధ్యాహ్నం 2గంటలలోపు విద్యార్థులు తమ వివరాలు పంపి నమోదు చేసుకోవాలని కోరారు.

---

## రాష్ట్రంలో రెవెన్యూ విభాగానికి

# అధునాతన భవనాలు

- కార్మిక శాఖ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి
- కుత్బుల్లాపూర్ తహసీల్దార్ భవనం ప్రారంభం



సొంత డబ్బుతో కార్యాలయాన్ని నిర్మించిన యాదగిరిరెడ్డిని సన్మానిస్తున్న మంత్రి



కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

**సుభాష్‌నగర్:** దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో రెవెన్యూ విభాగానికి అధునాతన భవనాలు నిర్మించడం అద్భుతమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని దేవేందర్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన కుత్బుల్లాపూర్ తహసీల్దార్ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌రావు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ... గతంతో పోల్చుకుంటే రెవెన్యూ యంత్రాంగంలో టెక్నాలజీ రావడంతో పని వేగవంతమైందన్నారు. కొన్ని పనులు చిన్న చిన్న కారణాలతో ఆలస్యం అవుతున్నాయని అధికారులు కలుగజేసుకుని పనుల్లో వేగవంతం పెంచి పనులను త్వరగా పూర్తిచేసి ప్రజల మన్ననలను పొందాలన్నారు.

**భవన దాతకు సన్మానం..**

గాజులరామారంకు చెందిన ప్లానర్, బిల్డర్ యాదగిరిరెడ్డి తన సొంతంగా కోటి 10లక్షల రూపాయలు వెచ్చించి తహసీల్దార్ భవనాన్ని నిర్మించినందుకు మంత్రి యాదగిరిరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఏనుగు నర్సింహారెడ్డి ఆర్డీవో మల్లయ్య తహసీల్దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్, స్థానిక తహసీల్దార్ సంజీవరావు, కార్పొరేటర్ రావుల శేషగిరి, కార్పొరేటర్లు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

ఎమ్మెల్యే వివేకానంద్

**కుత్బుల్లాపూర్:** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లకు చెందిన డివిజన్లలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే శుక్రవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీటి సౌకర్యం, నూతనంగా చేపట్టాల్సిన సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, శ్మశానవాటికల అభివృద్ధి, ఎస్ఎన్‌డీపీ నాలా పనులు, రిటైనింగ్ వాల్స్, కల్వర్టులు, థీమ్ పార్కులు, పార్క్ లు, ఓపెన్ జిమ్, కరెంటు సమస్యలు, కమ్యూనిటీ హాళ్లు, చెరువుల సుందరీకరణ వంటి అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు.

- ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలకు అసౌకర్యం లేకుండా చేపట్టబోయే పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పలు ప్రాంతాల్లో నెలకొన్న కుక్కలు, పందులు, దోమల బెడదను తగ్గించాలన్నారు. ×ప్రగతి యాత్రశలో తన దృష్టికి వచ్చిన ఫిర్యాదుల్లో ఎలక్ట్రిక్ పోల్స్ షిఫ్టింగ్, డిసిల్టింగ్ పనులు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజలకు ఇబ్బంది లేకుండా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీసీలు ప్రశాంతి, మంగతాయారు, ఎస్ఈ చెన్నారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ ఆనంద్, ఈఈ నారాయణ, డీఈఈ నరేందర్, ఈఈలు కృష్ణ చైతన్య, గోవర్ధన్‌గౌడ్, వాటర్‌వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి, డీఈఈలు శిరీష, పాపమ్మ, రూపాదేవి, భాను చందర్, ఏఈలు, మేనేజర్లు, ఎలక్ట్రిసిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దైవ చింతనతో మానసిక ప్రశాంతత



జీడిమెట్లలోని శ్రీవేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

**కుత్బుల్లాపూర్:** జీడిమెట్లలోని శ్రీవేంకటేశ్వర శివ వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి నిర్వహించిన అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా ఆలయ కమిటీ ఆయన్ని సత్కరించింది. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. స్వామి వార్ల కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు కృష్ణారావు, రాఘవేంద్రరావు, శ్రవణ్ కుమార్, మహిపాల్‌రెడ్డి, గోపాల్‌చారి, వీరేష్‌గౌడ్, బీజేపీ నాయకులు బాలప్ప, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్‌మ్యాక్స్ కార్మికులకు జీతాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సర్వే సత్యనారాయణ

**జీడిమెట్ల:** సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ యాజమాన్యం కార్మికుల సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించకపోతే ప్రత్యక్ష పోరాటానికి దిగేందుకు సిద్ధంగా ఉన్నానని కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. కొన్ని రోజులుగా పరిశ్రమ యాజమాన్యం జీతాలు చెల్లించడం లేదని కార్మికులు పరిశ్రమ ఎదుట రిలే నిరహార దీక్ష నిర్వహిస్తున్న విషయం విదితమే. శుక్రవారం సర్వే సత్యనారాయణ కార్మికుల దీక్షకు సంఘీభావం తెలియజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు జీతాలు చెల్లించకుండా ఎలాంటి హెచ్చరికలు జారీ చేయకుండానే పరిశ్రమ మూసివేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దాదాపు 1200 వందల కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని వారికి ఐఎన్‌టీయూసీ తరపున పూర్తి మద్దతు తెలుపుతామన్నారు. పరిశ్రమ యాజమాన్యం వెంటనే కార్మికులకు రావాల్సిన 8 నెలల జీతాలతో పాటు అన్ని గ్రాంట్‌లను చెల్లించకపోతే పరిశ్రమ యాజమాన్యంపై కాంగ్రెస్ పార్టీ తరపున పోరాటానికి దిగుతామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. సంఘీభావం తెలిపిన వారిలో ఆయన వెంట ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంజా శ్రీనివాస్, గూడ ఐలయ్య తదితరులు ఉన్నారు.

## క్రైం కార్నర్..

### ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**దుండిగల్:** కుటుంబ కలహాలకు తోడు అప్పులు ఎక్కువగా ఉండటంతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం సుందర్‌నగర్‌కు చెందిన దాసరి నగేష్(34) మేస్త్రీ పని చేస్తుంటాడు. కాగా నాలుగేళ్ల క్రితం నగేష్ తరచూ అతని భార్యను ఇంట్లో చిత్రహింసలు చేస్తుండటంతో అతని భార్య నాలుగేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒక్కడే ఉంటున్నాడు. కాగా నగేష్ గురువారం రాత్రి అతని సోదరి రాజమణికి ఫోన్‌కాల్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పి ఫోన్‌కట్ చేశాడు. ఆమె వెంటనే వారు ఉంటున్న పక్కింటి వారితో కలిసి సోదరుడు నగేష్ ఉండే ఇంటికి వెళ్లి తలుపు తట్టగా ఎంతకు తీయలేదు. తలుపులు తొలగించి చూసే సరికి నగేష్ లుంగీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడి సోదరి రాజమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ‘బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రమ దోపిడీకి పాల్పడుతోంది’



నిజాంపేట్ కార్పొరేషన్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

**నిజాంపేట్:** బీఆర్ఎస్ ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతోందని.. వారికి న్యాయమైన హక్కులను కల్పించకుండా ఇబ్బందుల పాలు చేస్తోందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు దాసి నాగరాజు అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొప్పు బాషాల ఆదేశానుసారం శుక్రవారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా దాసి సతీష్, నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు సరైన జీతాలు, వసతులు కల్పించకుండా మోసం చేస్తోందన్నారు. ఔట్ సోర్సింగ్ యాక్ట్ 2/94ను వెంటనే రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. జీవో 60 ప్రకారం జీతాలు చెల్లించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన మెమోరాండమ్‌ను కార్పొరేషన్ మేనేజర్ చంద్రప్రకాష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో.కన్వీనర్ డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రామచంద్రనాయక్, కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శులు భిక్షపతియాదవ్, నరేంద్రచౌదరి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొంకి రాము, ఎస్టీ మోర్చా జిల్లా సభ్యుడు వినోద్‌నాయక్, కుమార్‌గౌడ్, పల్లస్వామి, ఉమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## జీపీఎఫ్, టీఎస్జీఎల్ఐ డబ్బులు చెల్లించటంలో జాప్యం



జిల్లా ట్రెజరీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల నాయకులు

**చింతల్:** ఎయిడెడ్ జీతాలు, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని యూఎస్పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం మేడ్చల్ జిల్లా యూఎస్పీసీ స్టీరింగ్ కమిటీ పిలుపు మేరకు జిల్లా ట్రెజరీ కార్యాలయం భాగస్వామి సంఘాలు టీపీటీఎఫ్, యూటీఎఫ్, టీబ్ల్యూటీఎఫ్, బీటీఎఫ్ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి మాట్లాడుతూ... తెలంగాణ లాంటి ధనిక రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం... ఉద్యోగులు భద్రపర్చుకున్న జీపీఎఫ్, టీఎస్జీఎల్ఐ డబ్బులను చెల్లించటంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. అనంతరం యూటీఎఫ్ పత్రికా సంపాదకుడు మాణిక్‌రెడ్డి మాట్లాడుతూ... ఆర్థిక బిల్లులు సకాలంలో మంజూరు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులను అనేక ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఈ నిర్లక్ష్య ధోరణిని విడనాడాలన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులను దీర్ఘకాలంగా పెట్టుకొని విడుదల చేయకపోవడంపై ఉద్యోగ ఉపాధ్యాయులు అనేక రకాల సమస్యల్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. అత్యవసర సమయంలో దాచుకున్న డబ్బులను తీసుకోవాల్సి సందర్భంలోనూ ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని తెలిపారు.


## ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య



రవికుమార్ (ఫైల్)

**కుత్బుల్లాపూర్:** ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైటెన్షన్ లైన్ హవి విల్లా హోంలో నివాసముంటున్న భైరి రవికుమార్(55) గ్రానైట్ వ్యాపారం చేస్తాడు. కొన్ని రోజుల నుంచి వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో అతను తాగుడుకు బానిసయ్యాడు. ఈనెల 23న ఎస్ఆర్‌నగర్‌లో బంధువుల ఇంట్లో శుభకార్యానికి అతను తన భార్య త్రిసంధ్యారాణి కుమారుడితో కలిసి వెళ్లాడు. అదే రోజు రాత్రి ఇంటికి రాగా వచ్చాక రవికుమార్ ఇంట్లో గెస్ట్ రూమ్‌లో పడుకోగా, భార్య కుమారుడు వార్వారి బెడ్‌రూమ్‌లలో నిద్రించారు. శుక్రవారం ఉదయం వాకింగ్ కోసం రవికుమార్‌ను నిద్రలేపేందుకు గెస్ట్ రూమ్‌కు వెళ్లి తలుపులు తట్టగా ఎంతకీ తీయలేదు. దీంతో చుట్టు పక్కల వారి సహాయంతో తలుపులు తెరిచి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. అతడిని కిందకు దింపి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలియజేశారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చదువు మానేసి తప్పు చేశానని యువకుడు ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

**జీడిమెట్ల:** పదో తరగతి తర్వాత చదువు మానేసి తప్పు చేశానని ఓ యువకుడు తాగుడుకు బానిసై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మన్మద్ వివరాల ప్రకారం.. జీడిమెట్ల కాకతీయనగర్‌కు చెందిన యామిని, రాంబాబు దంపతులు 20 ఏళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. వీరికి ముగ్గురు సంతానం నిఖిల్(23), ప్రశాంత్(21), త్రిపురేశ్వరి(9). వీరి చిన్న కుమారుడు ప్రశాంత్ పదో తరగతి పాసయ్యాక కాలేజీలో చేరిన కొద్దిరోజులకే మానేశాడు. అప్పటి నుంచి జీడిమెట్లలోని ఓ ఆక్సిజన్ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. రెండేళ్లుగా నేను చదువుకోకుండా ఇలా చిన్న ఉద్యోగాలు చేయడం నచ్చట్లేదని ఇంట్లో చెప్పేవాడు. దీనికి తోడు ప్రశాంత్ మద్యానికి బానిసయ్యాడు. ఆరు నెలల క్రితం మద్యం మత్తులో నిద్రమాత్రలు మింగడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా బతికాడు. ఎప్పటిలాగే ప్రశాంత్ రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి అందరితో పాటు నిద్రకు ఉపక్రమించాడు. ప్రశాంత్ తల్లి యామిని ఉదయం 5గంటలకు నిద్రలేచి చేసే సరికి ప్రశాంత్ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. మృతుడి తల్లి యామిని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## సమ్మేళనాలతో విభేదాలు

# సమసిపోయేనా..!

- రానున్న ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమంపై ప్రజల్లో ప్రచారం
- నెల రోజుల కార్యాచరణ ఖరారు చేసిన పార్టీ నాయకులు
- జిల్లా సమన్వయ కర్తగా, ఎమ్మెల్సీ, రైతు బంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- మంత్రి, ఎమ్మెల్యేలు, నాయకుల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలపై కేడర్‌లో చర్చ

### మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బీఆర్ఎస్ బలోపేతం లక్ష్యంగా సమ్మేళనాలు



**సాక్షి, మేడ్చల్ జిల్లా:** రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యకర్తలందర్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు ఆత్మీయ సమ్మేళనాలకు శ్రీకారం చుడుతోంది. దాదాపు నెల రోజుల పాటు జరిగే సమ్మేళనాల్లో ప్రభుత్వ పథకాలపై ప్రచారం కల్పించడంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలని భావిస్తోంది. ఇందుకోసం పార్టీ శ్రేణులను సమన్వయ పరిచేందుకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజుతో కలిసి జిల్లాకు సమన్వయకర్తగా అధిష్టానం నియమించిన ఎమ్మెల్సీ, రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి పార్టీ కార్యకర్తలను ప్రజల్లోకి పంపించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను ప్రజలకు వివరించే కార్యక్రమంలో కార్యకర్తలందరిని భాగస్వాములను చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన పథకాల వివరాలను ప్రజలకు వివరించాలని అధిష్టానం ఆదేశించింది. ఇందు కోసం కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం పేరిట గ్రామాల్లో, పురపాలక సంఘాల్లో డివిజన్లు/వార్డుల్లో సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు, సర్పంచి, ఎంపీటీసీ సభ్యులు, రైతుబంధు కన్వీనర్, సింగిల్ విండో చైర్మన్లతో పాటు జడ్పీటీసీ, ఎంపీపీ, మండల పార్టీ కార్యవర్గం, అనుబంధ సంఘాలు, కార్పొరేషన్ చైర్మన్లు అందరితో ఈ సమావేశం నిర్వహించనున్నారు. సంబంధిత నియోజకవర్గ ఇన్‌చార్జి ఉండే ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ, జడ్పీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, ఇతర పదవులున్న నేతలందరినీ ఆహ్వానిస్తారు. పురపాలక సంఘాల్లో కార్పొరేటర్/కౌన్సిలర్, పార్టీ వార్డు అధ్యక్షుడు ఇతర కార్యవర్గాన్ని భాగస్వామ్యం చేస్తారు. మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు సమావేశాల్లో పాల్గొనేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

**నెల రోజుల పాటు బీఆర్ఎస్ సమ్మేళనాలు**

గ్రామ కార్యకర్తల సమ్మేళనం ఏ తేదీన నిర్వహిస్తారో నియోజకవర్గ ఎమ్మెల్యే నిర్ణయించాల్సి ఉంటుంది. వివరాలను పార్టీ జిల్లా ఇన్‌చార్జి లేదా సమన్వయకర్తకు అందజేస్తే అక్కడి నుంచి వచ్చిన ఆదేశాలకనుగుణంగా సమావేశాలు నిర్వహిస్తారు. ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 24వ తేదీలోగా ఈ సమ్మేళనాలు పూర్తిచేయాలి. అనంతరం 25న గ్రామాల్లో, వార్డుల్లో పార్టీ జెండాలు ఎగురవేసి పండగ వాతావరణం తలపించేలా కార్యక్రమం చేపట్టాలని సూచనలు ఉన్నాయి. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా సచివాలయం ఎదుట 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనుండటంతో జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలు ఉత్సవాలు నిర్వహించనున్నారు. కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాల విజయవంతం కోసం పార్టీ జిల్లా సమన్వయ కర్త ఇక్కడకు చేరుకుని నేతలకు దిశా నిర్దేశం చేస్తారు. పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం పటిష్టపరచడంపైనా దృష్టిపెడుతారు. సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో విద్యార్థులను ఇందులో చేర్పించనున్నారు. ప్రస్తుతం పరీక్షల కాలం కావడంతో [illegible]

**సమ్మేళనాలు ఇలా...**

పది గ్రామాలను కలిపి ఒక సమ్మేళనం ఏర్పాటు చేస్తారు. పట్టణాల్లో 3 నుంచి 4 వార్డులను కలిపి ఓ సమ్మేళనం ఉంటుంది. గ్రామాల నుంచి వచ్చే కార్యకర్తలకు అక్కడ చేపట్టిన అభివృద్ధిని గణాంకాలతో సహా వివరిస్తారు. పథకాలతో లబ్ధిపొందిన వారి జాబితాను అందిస్తారు. ఆ వివరాలతో కార్యకర్తలు కలసికట్టుగా పర్యటిస్తూ.. ప్రభుత్వం గ్రామానికి ఏం చేసింది? ఎన్ని నిధులతో పనులు జరిగాయి? ఎందరు లబ్ధి పొందారో వివరించి ప్రజలను ఆకట్టుకునేలా చేయడం ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోంది.

**విభేదాలు సమసి.. సమన్వయం జరిగేనా..!**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బీఆర్ఎస్ నేతల మధ్య అంతర్గంగా కొనసాగుతున్న విభేధాలు.. త్వర లో జరిగే విస్తృత సమ్మేళనాలతో సమసి పోగలవా .. లేక మరింత ముదురుతాయన్న చర్చ పార్టీ వర్గాలను వేధిస్తోంది. మంత్రి మల్లారెడ్డిపై జిల్లాకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయగా, ఇంత వరకు ఇది ఓ కొలిక్కివచ్చిన దాఖలాలు కనిపించడం లేదు. కొద్ది రోజుల కిందట మల్కాజిగిరి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత హన్మంతరావు ఇంట్లో సమావేశమైన జిల్లా పార్టీకి చెందిన 5 ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి నిధుల విషయంలో మంత్రి మల్లారెడ్డి జోక్యాన్ని తప్పుపట్టారు. ఈ వ్యవహారశైలిపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తమని, 5 ఎమ్మెల్యేలు ఆ సందర్భంగా ప్రకటించారు. అలాగే, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆదేశాలను ఖాతర్ చేయకుండా నామినేటెడ్ పదవులను మంత్రి మల్లారెడ్డి సొంత నియోజకవర్గం వారికి కట్టబెట్టారని ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈ వ్యవహారం ఇంకా చక్కబడకపోవడంతో విభేదాలు కొనసాగుతూనే.. ఉన్నాయి. అలాగే మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డి వర్సెస్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఉప్పల్‌లో ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, మాజీ మేయరు బొంతు రామ్మోహన్, కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే వివేకానందగౌడ్, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు మధ్య విభేదాలు తారస్థాయిలో ఉన్నట్లు కేడర్‌లో చర్చ సాగుతోంది. కూకట్‌పల్లిలో కూడా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరు తమ వర్గాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని 13 పురపాలక సంఘాలోల్ అధికార పార్టీ మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఉన్నప్పటికీ వారి మధ్యనే ఉన్న విభేదాలు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా కొనసాగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోని డివిజన్లతో సహా పలు గ్రామాల్లో కూడా పార్టీ ప్రజాప్రతినిధుల మధ్య అంతర్గత విభేదాలు చాపకింద నీరులా కొనసాగుతున్నాయి. అయితే.. పార్టీ విస్తృత సమ్మేళనాలతో బీఆర్ఎస్ నేతల మధ్య నెలకొని ఉన్న విభేదాలు సమసిపోతాయా.. లేక భగ్గుమంటాయా.. అన్న ఆందోళన కేడర్ నుంచి వ్యక్తమవుతుండగా, [illegible]